

నేటి నుంచి కొత్త టీచర్లు

● ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు ● పాఠశాలల్లో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం (నేటి) నుంచి కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ పూర్తిచేసింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు రెండురోజులపాటు నియామక పత్రాలను ఆన్‌లైన్‌లో అందచేశారు.



ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయడంతో ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అయ్యేలా పాఠశాలలన్నీ కోలాహలంగా మారనున్నాయి. కొత్త అయ్యోర్లు పాఠశాలలకు రానుండడంతో వారిని జాయినింగ్ చేసుకునేలా సర్వం సిద్ధం చేశారు.

● నేడు విధుల్లో చేరిక

మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి పదిరోజులపాటు ప్రత్యేకశిక్షణ అందించి నియామక పత్రాలు అందచేశారు. జిల్లాలో విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలల్లో వీరిని నియమించారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలల్లో కలిపి మొత్తం 651 పోస్టులను భర్తీ చేశారు. వీటిలో ప్రభుత్వ జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగం ఇంగ్లిష్ 82, హిందీ 17, తెలుగు 29, ఉర్దూ 4, బయాలజీ 62, మ్యాథ్స్ 62, ఫిజికల్ డైరెక్టర్లు 103, ఫిజికల్ సైన్స్ 74, సోషల్ 101 పోస్టులు భర్తీ అయ్యాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 85 పోస్టులు కలిపి మొత్తం 619 భర్తీ అయ్యాయి. వీటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్‌ఏ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, తెలుగు 1, ఉర్దూ 1 పోస్టులు, ఎస్‌జీటీ తెలుగు 13, ఉర్దూ 4 కలిపి 20 పోస్టులు, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఎస్‌ఏ విభాగంలో మ్యాథ్స్ 1, ఫిజికల్ డైరెక్టర్ 1, ఫిజికల్ సైన్స్ 1, ఎస్‌జీటీ తెలుగు 9 కలిపి మొత్తం 12 పోస్టులు భర్తీ చేశారు. మొత్తం మీద ప్రభుత్వ, జడ్పీపీ, ఎంపీపీ పాఠశాలల్లో 619 పోస్టులు, కార్పొరేషన్ పాఠశాలల్లో 20, మున్సిపాలిటీ పాఠశాలల్లో 12 కలిపి మొత్తం 651 మంది కొత్త టీచర్లు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి : డీఈవో బాలాజీరావు



పాఠశాలల్లో కొత్తగా చేరుతున్న ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలి. సోమవారం పాఠశాలల్లో చేరిన వెంటనే ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులు వెంటనే రిలీవ్ కావాలి. మంగళవారం నాటికి వారు బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేరిన పాఠశాలల్లో రిలీవ్ చేయని వారిని కూడా వెంటనే రిలీవ్ చేసేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలి. కొత్తగా చేరిన టీచర్ల రిపోర్ట్ తేదీని పాఠశాల రికార్డుల్లో నమోదు చేసి వారి అర్హత సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. పత్రాలు సరిగాలేని వారి వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియచేయాలి.

మాట చెప్పడమేనా..?

● అమలు తీరును పట్టించుకోరా...
● నత్తనడకన ఎన్‌హెచ్ ఫ్లైవోవర్ల నిర్మాణం
● సెప్టెంబరుకు పూర్తి చేస్తామన్న గడ్కరీ
● కానీ ఇప్పటికీ పూర్తికాని వైనం
● గడువు పెంచినా కదలని కాంట్రాక్టరు
● ట్రాఫిక్‌జామ్‌తో ప్రజల అవస్థలు



నెల్లూరు నగరంలోని బుజబుజనెల్లూరు వద్ద జాతీయ రహదారిపై సాగుతున్న ఫ్లైవోవర్ పనులు

నెల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'జాతీయ రహదారి(ఎన్‌హెచ్)-16పై నెల్లూరు నగరంలోని బుజబుజనెల్లూరు, గొలగమూడి వద్ద నిర్మిస్తున్న రెండు ఫ్లైవోవర్లను 2025 సెప్టెంబరు 11 లోపు పూర్తి చేస్తాం'.. ఇదీ గతేడాది పార్లమెంటులో కేంద్ర రహదారులశాఖమంత్రి నితిన్ గడ్కరీ చెప్పిన మాట. అయితే ఆయన చెప్పిన గడువు ముగిసింది కానీ, ఫ్లైవోవర్లు మాత్రం పూర్తికాలేదు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే ఫ్లైవోవర్లు పూర్తవడానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదో పనులు జరుగుతున్నాయని చెప్పడానికే తప్ప.. పనుల్లో వేగం కనిపించడం లేదు. ఏడాది క్రితమే ఈ వంతెనల పనులు పూర్తవ్వాల్సి ఉన్నా, వివిధ కారణాలతో జాప్యం జరిగింది. పోనీ పనులు ప్రారంభమైన తర్వాతైన వేగం పుంజుకున్నాయా.. అంటే అదీలేదు. మొత్తం ఫ్లైవోవర్ అటుంచితే కనీసం అటు, ఇటు వెళ్లడానికి వీలుగా బాక్స్‌టైపు బ్రిడ్జిలను కూడా పూర్తి చేయలేకపోయారు. దీంతో వాహనదారులు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. సాధారణంగా జాతీయ రహదారులపై పనులు వేగంగా పూర్తి చేస్తుంటారు. కానీ ఆ పరిస్థితి నెల్లూరులో కనిపించడం లేదు.

పనుల్లో కనిపించని వేగం

2022లో కేంద్ర ప్రభుత్వం రూ.85 కోట్ల అంచనాలతో బుజబుజనెల్లూరు వద్ద కిలోమీటర్ మేర ఓ ఫ్లైవోవర్, గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద కిలోమీటర్ మేర మరో ఫ్లైవోవర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఆ వెంటనే టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. టెండర్ నిబంధనల ప్రకారం గతేడాదికే ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ భూసేకరణ సమస్యతో కొన్ని నెలలు పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు భూసేకరణను పూర్తి చేశారు. అనంతరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ క్రమంలోనూ కొంతకాలం పనులు ఆలస్యమయ్యాయి. పనులు ఆలస్యంగా జరగడంపై అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో గతేడాది పనులు మొదలుపెట్టించారు. దీంతో బుజబుజనెల్లూరు, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేశారు. అయితే పనులు మొదలైనప్పటి నుంచీ ఆశించినంత వేగంగా జరగడం లేదు. గతేడాది చివరికే పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ అలా జరగకపోవడంతో కాంట్రాక్టర్‌కు ఈవోటీ(గడువు పొడిగింపు) ఇచ్చారు. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబరు నాటికి బ్రిడ్జిలు పూర్తి కావాల్సి ఉంది. గతేడాది డిసెంబరులో పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు.

అటు ట్రాఫిక్.. ఇటు దుమ్ము

నెల్లూరులోకి రాకపోకలు సాగించాలంటే బుజబుజనెల్లూరు, గొలగమూడి జంక్షన్‌లు కీలకం. నెల్లూరు నగరం విస్తరిస్తున్న కొద్దీ ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అక్కడ ఫ్లైవోవర్లు నిర్మించాలని నిర్ణయించింది. అయితే బ్రిడ్జిల నిర్మాణం పేరుతో డైవర్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా దూరం పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. అదే సమయంలో బ్రిడ్జిల నిర్మాణానికి ఫ్లైయాష్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది గాలికి దుమ్ముగా రేగుతుండడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇక్కడ కూడా నిర్మాణదారులు సరైన నివారణ చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఎంత త్వరగా ఈ బ్రిడ్జిలను పూర్తి చేస్తే అంత త్వరగా ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయి.

వెలుగు పథకం వీవోఏలకు ఊరట

● మూడేళ్ల కాలపరిమితి జీవో నిలుపుదల

8

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

● ఏఐసీసీ కార్యదర్శి గణేశ్ కుమార్

8

సెలవురోజున తరగతులు

● విద్యాశాఖ తనిఖీలు ● విద్యార్థులను ఇళ్లకు పంపిన అధికారులు
● ఇక ప్రతీ వారం తనిఖీలు : ఎంఈవో



కావలిలో ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న ప్రముఖ ప్రైవేట్ పాఠశాల నుంచి విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఎంఈవో గోవిందయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఆదివారం అయినా కూడా నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నాయి. దీంతో డీఈవో ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో క్లాసులు జరుగు తుండటాన్ని గమనించి, విద్యార్థులకు ఇళ్లకు పంపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'సెలవులైనా క్లాసులే' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో డీఈవో స్పందించారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కావలి ఎంఈవోకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆదివారం ఎంఈవో గోవిందయ్య కావలి పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు తరగతి గదుల్లో ఉండటంతో పాఠశాల యాజమాన్యంతో మాట్లాడారు. సెలవుల్లో తరగతులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపి, పాఠశాలలను మూయించారు. ఇక నుంచి ప్రతి ఆదివారం పాఠశాలలను తనిఖీలు చేస్తామని, తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



8

పెన్నమ్మను కుళ్లబొడుస్తున్నారు..

● మూడు రోజులుగా ఇసుక, మట్టి తవ్వకాలు

రేపు జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు చెముడుగుంటలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో ఈనెల 14న (మంగళవారం) ఉదయం 9 గంటలకు 'క్వాంటర్ ఏజ్ బిగిన్స్-పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈవో బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. సెమినార్‌లో ఇవ్వబడిన అంశంపై రాతపరీక్ష, ప్రజంటేషన్, క్విజ్ సాధనాల ద్వారా న్యాయనిర్ణేతలు విద్యార్థులను పరీక్షించి విజేతలను ఎంపిక చేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థి 5 చార్ట్స్, స్లైడ్స్ ఉపయోగించి గరిష్ఠంగా ఆరు నిమిషాలు ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అనుమతి ఉందన్నారు. ఈ సెమినార్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని డీఈవో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 15న విజయవాడలో జరిగే పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలు బెంగళూరులో ఈనెల 30న జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జిల్లా సైన్స్ అధికారి శివారెడ్డిని సంప్రదించి, సోమవారం (నేటి) సాయంత్రంలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పీఎం బందోబస్తుకు జిల్లా పోలీసులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలు జిల్లాలో జీఎస్టీ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబునాయుడు రానున్నారు. వారి బందోబస్తు కోసం జిల్లా పోలీసులు ఆదివారం తరలివెళ్లారు. జిల్లా నుంచి 250 మంది పోలీసులు కర్నూలు వెళ్లగా, శ్రీశైలానికి 60 మంది వెళ్లారు. మొత్తం జిల్లా నుంచి 310మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు.

లాడ్జీలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

● తెరుచుకోని గదుల తలుపులు
● భయంతో ప్రజల ఆర్తనాదాలు
● తప్పిన పెనుప్రమాదం

వివరాలు 8వ పేజీలో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11,731
వెండి కిలో ధర	రూ. 1,67,100
వెండి ఒక గ్రాము	రూ.175.00

కమనీయం వేంకటేశ్వరుడి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేట జలకన్య బొమ్మ దగ్గర కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ముందుగా కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్‌హాల్‌ను టీడీపీ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, మామిడాల మధు, జనసేన సీనియర్ నేత నూనె మల్లికార్జునయాదవ్, విద్యావేత్త నేతాజీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొన్నాల అఖిలేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మంది మహిళలతో కార్తీక దీపోత్సవం

● గోడపత్రిక ఆవిష్కరించిన నిర్వాహకులు



మహా కార్తీక దీపోత్సవం గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద నవంబరు 5, 6, 7వ తేదీలలో లక్ష మంది మహిళలతో జరిగే మహా కార్తీక దీపోత్సవం గోడపత్రికను నిర్వాహకులు ఆవిష్కరించారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన సింహపురి కార్తీక దీపోత్సవ సమితి విస్తృత స్థాయి సమావేశంలో అధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల మాట్లాడుతూ నగరంలో జరిగే మహా కార్తీక దీపో త్సవం కార్యక్రమం తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పడిందన్నారు. సుమారు లక్ష మంది మహిళలచే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యదర్శి బయ్యా మల్లిక మాట్లాడుతూ ఈ ఏడాది ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రతి ఒక్కరూ శ్రీశైలం మల్లికార్జునస్వామి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు స్వయంగా చేసుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంపతులతో శ్రీపార్వతీ పరమేశ్వర్లు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నవంబరు 6న సత్యనారాయణ స్వామి వ్రతం, 7న స్వర్ణలింగేశ్వర స్వామి వార్షిక కుంభాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కోడూరు జయరాం, ముక్కాల వ్యాసప్రసాద్, శ్రీకంఠం రమణయ్య, బాలసుబ్బారావు, రమేష్, ఏవీఆర్ మోహన్‌రావు, పీ.సురేందర్‌రెడ్డి, కిషోర్, హర్షవర్ధన్, శ్రీనివాసులు, రంగరాజన్, భాస్కర్‌రావు, సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు వ్యాసరచన పోటీ



పోటీల్లో పాల్గొన్న మహిళలు

నెల్లూరురూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలో తెలుపుతూ మహిళలకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. నగరంలోని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ భాషాల్లో నిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి వచ్చే ఆదివారం బహుమతులు అందజేస్తామని కర్తం తెలిపారు. దీనివల్ల మహిళల్లో పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని వెల్లడించారు. ఇంట్లో పరిశుభ్రతను పాటించేది మహిళే కాబట్టి వారి ద్వారానే శుభ్రత పెరుగుతుందన్నారు. ఇంటి పరిసరాలను ఎలా శుభ్రం చేసుకోవాలో కూడా ఈ పోటీలలో తెలుస్తాయన్నారు. ఇప్పటికే ఈ డివిజన్‌లో ఒక రోజు, ఒక వీధి పేరిట పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్నా యన్నారు.

అబ్దుల్ కలాం ముందస్తు జయంతి వేడుకలు



విజేతలతో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, విద్యార్థులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో ఆదివారం మాగుంటలేఅవుట్‌లోని ఓ పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ముందస్తు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ జీ.సుభద్రాదేవి, పల్లెపాడు డైట్ ఉపాధ్యాయిని నీరజ, రాజా, సునీల్, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద' ఆధ్వర్యంలో వైద్యశిబిరం

నెల్లూరు(విద్య), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడామైదానంలో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలను అందచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ వాకర్స్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, సుబ్బరామిరెడ్డి, గఫార్, చంద్రమౌళి, జయదేవ్, ఆరి ప్రసాద్, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి, సత్యనాథ్, శ్రీధర్, కేఎంకే రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో యువత చేరిక



జనసేన పార్టీలో చేరిన యువకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 16వ డివిజన్‌లో చిల్డ్రన్స్‌పార్క్ ఎదురు వీధిలో ఆ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఏఎంసీ డైరెక్టర్ విజయలక్ష్మిలు యువతకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గునుకుల కిషోర్ మాట్లాడుతూ నిత్యం డివిజన్‌లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ ఉండటంతో ఎంతో మంది ప్రజలు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పేద ప్రజలను ఆప్తులుగా భావించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు జనసేన పార్టీ స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లపు సుధామాధవ్, గుర్రం కిషోర్, వెంకటేశ్వర్లు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకళల పరమేశ్వరికి నెక్లెస్ బహూకరణ



ఇరుకళల పరమేశ్వరికి నెక్లెస్ అందజేస్తున్న దాతలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మూలాపేటలో వెలసి వున్న ఇరుకళల పరమేశ్వరికి మునగల మహేష్‌రెడ్డి, కీర్తిరెడ్డిలు బంగారు నెక్లెస్ (35 గ్రాములు) ఆదివారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వీ.గిరికృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలు చేశారు.

చిన్నారులకు దుస్తులు, టపాకాయల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న నగేష్‌రెడ్డి, చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(హరనాథపురం); అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని వాత్సల్య చిన్నారులకు వ్యాపారవేత్త దువ్వూరు నగేషరెడ్డి ఆదివారం దుస్తులు, టపాకాయలను పంపిణీ చేశారు. అదేవిధంగా టీ.శ్రవణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆ బాలుడి తల్లిదండ్రులు వాత్సల్య చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా హంస, ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వాత్సల్య విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య అధ్యక్షుడు రామదండు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవసేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ, ఎంఈవో మురళీధర్, ఆర్ ఇందిర, జీ.సుధీర్‌బాబు, వ్యాపారవేత్త జేపీ జైన్, జీవీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

పొదలకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యత కోసం పోరాటం చేస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ల పూర్తి చేసు కున్న సందర్భంగా ఆదివారం స్థానిక సాయిబాబా మందిరంలో శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యవక్తగా జిల్లా సహ బౌద్ధిక్ ప్రముఖ్ అబిరామ్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఆర్ఎస్ఎస్ చేపడుతున్న హిందూ ధర్మ కార్యక్రమాలను స్వయం సేవక్‌లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖండా కార్యవాహ ఏ జనార్ధన్ రెడ్డి, సంఘ మండల కార్యవాహ వై చెంచయ్య, ఆర్. రాజేష్, సాయి నిఖిల్, బీజేపీ అధ్యక్షుడు పూల ప్రశాంత్, రాచపూటి ధనుంజయరావు, నున్నా శివకుమార్, ఎం రవీంద్రబాబు, కాశీ నాయనాస్వామి నరసింహస్వామి, స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

మంగళగిరి గంధమహోత్సవానికి రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ఆహ్వానం



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందచేస్తున్న నిర్వాహకులు

నెల్లూరురూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గం మెల్లెంపూడి గ్రామంలో గ్యార్మీ గంధమహోత్సవానికి రావాలని కమిటీ నాయకులు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం అక్కడినుంచి నెల్లూరుకు వచ్చిన కమిటీ సభ్యులు మాట్లాడారు. తొలత తాము నారా లోకేష్‌ను ఆహ్వానించామన్నారు. ఆయన అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. మీకు నచ్చిన నాయకుడు ఎవరో చెప్పండి నేనే స్వయంగా చెప్పి పంపుతానని లోకేష్ చెప్పడంతో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని పంపాలని తామంతా కోరామన్నారు. అనంతరం లోకేష్ సూచనలతో ఇక్కడకు వచ్చామని, శ్రీధర్‌రెడ్డి అంటే తమకెంతో ఇష్టమని చెప్పారు. 18న జరిగే ఈ గంధమహోత్సవానికి తప్పక హాజరవుతానని వెల్లడించారని కమిటీ సభ్యులు తెలిపారు.

పెంచలరావు మృతి బాధాకరం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్టీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆకస్మిక మృతి బాధాకరమని హంస, ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైలోని అపోలో వైద్యశాలలో శనివారం రాత్రి ఆయన మృతి చెందారని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా పెంచలరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సేవాదళ్ సభ్యులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్‌లో సాయిబాబా 107వ మహా సమాధి (ఆరాధన) మహోత్సవం సందర్భంగా శ్రీసాయినాథుడు ఆచరించి చూపిన మానవసేవలో భాగంగా ఆదివారం వేకువజామున శ్రీసాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంతో మంది దాతల సహకారంతో నెల్లూరు నగరంలోని నలుమూలల ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్, బస్టాండ్, మందిరాలు, మసీదు, చర్చ్ బయట ఉంటున్న నిజమైన పేదలకు, వృద్ధులకు వీటిని అందజేశారు. అలాగే గొలగమూడి, నరసింహకొండ, జొన్నవాడలో యాచకులకు 500 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు శ్రీసాయినాథుడి పరిపూర్ణ అనుగ్రహం ఉండాలని బాబాకు మధుసాయి ప్రార్థన చేశారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన రాపూరు మండలానికి చెందిన పలువురిని ఆదివారం వెంకటగిరి ఎమ్మెల్యే కార్యాలయంలో కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. వెంకటగిరి నియోజకవర్గపరిధిలో ఉపాధ్యాయులుగా ఎంపికైన 64 మందిలో రాపూరు మండలానికి చెందిన 15 మందిని సత్కరించారు. వీరిలో మండలానికి చెందిన సయ్యద్ సిరాజ్ అహ్మద్ కుమార్తె సయ్యద్ షబ్నాజ్ హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లేరులో చేపల పెంపకంపై అధ్యయనం



చేపల చెరువును పరిశీలిస్తున్న విద్యార్థులు

కైకలూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొల్లేరులో క్షేత్రస్థాయిలో పర్యటించడం వలన చేపల సాగు చేసే విధానాలను తెలుసుకోవడం తమ విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని మత్స్యకళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరు జిల్లా కైకలూరు మండలంలోని కొల్లేరు ప్రాంతంలో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్యకళాశాలకు చెందిన విద్యార్థులు చేపల పెంపకంపై క్షేత్రపరిశీలన చేశారు. కైకలూరు మత్స్యశాఖ అధికారులు విద్యార్థులకు చేపల సాగు చేసే విధానాన్ని, చేపల వినియోగించే మేతలు, మందులు, సీడ్ ప్లాంట్లు, కొల్లేరు సాంప్రదాయ వేట పద్ధతులను మత్స్యశాఖ అధికారులు వివరించారు. ఆటపాకలో తెల్లచేపలు, ఫంగస్‌జాతి చేపలు సాగు చేసే యాజమాన్య పద్ధతులను ప్రత్యక్షంగా తిలకించారు. వ్యాధులు సంక్రమించినప్పుడు ఏయే మందులు వినియోగిస్తారో రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ పర్యటన ఎంతో దోహదపడిందని, కొల్లేరులో చేపలు సాగుచేసే విధానం తమకెంతో విజ్ఞానంకలిగిందన్నారు. మత్స్యకళాశాల ప్రొఫెసర్లు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

స.హ. చట్టంతో పారదర్శకత



అవగాహన కల్పిస్తున్న గండికోట

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని వ్యవస్థల్లో పారదర్శకత తీసుకురావడం కోసమే సమాచార హక్కుచట్టం అమల్లోకి వచ్చిందని ఉపాధ్యాయుడు గండికోట సుధీర్ కుమార్ పేర్కొన్నారు. స.హ. చట్టం అమ ల్లోకి వచ్చి 20 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఆది వారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో స.హ. చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏ శాఖకు సంబంధించిన వివరాలైనా స.హ. చట్టం ద్వారా పొందే హక్కు ఉందని ఆయన తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెం పరిధిలోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆదివారం ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. కానుగ చెట్ల కాలనీ సమీపంలోని ఓ లేఔట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు చేశారు. రూ. 6290 నగదు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఆరుగురు బుచ్చితోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలతోపాటు రాష్ట్ర నలమూలల నుంచి భక్తులు తరలివచ్చి మస్తాన్ స్వామిని దర్శించుకున్నారు. షాఫా బావిలో పుణ్య స్నానాలు ఆచరించి, ప్రార్థనలు చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాపూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం 1989-1990 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులందరూ పరస్పరం ఆనందాన్ని పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సహచారులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. తీపి జ్ఞాపకంగా గ్రూప్ ఫోటో తీసుకున్నారు.

తీరిన నాలుగు గ్రామాల దాహార్తి

సొంత నిధులతో శీనయ్య బోరు ఏర్పాటు



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు

ముత్తుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాలుగు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు సొంత నిధులతో మండల బీసీ సెల్ అధ్యక్షుడు పల్లికొండ శీనయ్య సొంత నిధులతో బోరు ఏర్పాటు చేశారు. వల్లూరు పంచాయతీలోని బండ్లపాలెం దళితవాడ, వడ్డిపాలెం, మేడిచర్లమెట్ట, బొట్టువారికండ్రిగ గ్రామాల ప్రజలు గత నెల రోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక నాయకుడు పల్లికొండ శీనయ్య స్పందించారు. ఆ నాలుగు గ్రామాల్లో బోరు మోటార్లను రూ.40 వేల సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. ఆదివారం ఆ గ్రామాలకు మంచి నీరు సరఫరా చేయడంతో ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డికి, స్థానిక నాయకుడు పల్లికొండ శీనయ్యకు ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రామికనగర్‌లో పారిశుధ్య పనులు



కాలువను శుభ్రం చేయిస్తున్న జనసేన నాయకులు

పొదలకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రామికనగర్‌లో జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేశ్‌నాయుడు ఆదివారం పారిశుధ్య పనులు చేయించారు. ఎప్పటినుంచో మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కాలనీ ప్రజలు సురేశ్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యనమల మధు, సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం, రమణయ్య, పంతగిరి పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో పారదర్శకంగానే ఇళ్లు కేటాయింపు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి



చవటపాళెంలో పర్యటిస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల నిర్మాణం కోసం లే అవుట్లు వేసి పారదర్శకంగానే ఇళ్లను కేటాయించినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మండలంలోని చవటపాళెం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా రూ. కోట్ల విలువ చేసే భూములను పేదల ఇళ్ల నిర్మాణాలకు కేటాయించినట్లు తెలిపారు. పేదల ఇళ్ల స్థలాలను రద్దు చేస్తే అధికారులు భవిష్య త్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మందల వెంకటశేషయ్య, పారిచెర్ల మస్తానయ్య, తాళ్లపాక ఏడుకొండలు, తాటిపర్తి సురేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

ముత్తుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మదేవం పంచాయతీ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గిరిజన కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. పిడతాపోలూరు రోడ్డులోని గిరిజన కాలనీలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానిక టీడీపీ నాయకుడు తిరుమలశెట్టిల సతీష్ నాయుడు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించి, సహాయక చర్యలను పర్యవే క్షించారు. అగ్నిమాపక యంత్రాలు వచ్చేటప్పటికే పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఆదుకోవాలని పేద గిరిజనులు అధికారులకు విన్నవించుకున్నారు.

ఆరుగురు కొత్త అయ్యవార్లు నేడు విధుల్లోకి..!

మనుబోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులకు కొత్త ఉపాధ్యాయులను కేటాయించారు. మనుబోలు బాలుర ఉన్నత పాఠశాలకు ముగ్గురు, మడమనూరు ఉన్నత పాఠశాలకు ఇద్దరు, అక్కంపేట ఎన్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించారు. సోమవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో వారు విధులకు హాజరు కానున్నారు.

ఒక్కసారే వింటుంది... వందసార్లు చెబుతుంది..!

చిరు వ్యాపారులు వీధుల్లో అరుస్తూ కూరగాయలు, పండ్లు, పూలు, ఇతరత్రా వస్తువులు విక్రయిస్తుంటారు. అలాగే మార్కెట్, బస్టాండ్ సెంటర్లలో తోపుడుబండ్లు, వీధుల్లో తిరిగే ఆటోల్లోనైనా ఇదే పరిస్థితి. రోజంతా గట్టిగా కేకలు పెట్టడం వల్ల గొంతు బొంగురుపోయేది. ఈ తరుణంలో వ్యాపారులు మార్కెట్‌లో లభ్యమవుతున్న మైక్రో మైకులను కొనుగోలు చేసి అందులో తాము విక్రయించే వస్తువుల వివరాలు రికార్డు చేస్తున్నారు. ఆ మైక్రో మైకు ఛార్జింగ్ ఉన్నంత వరకు నిరంతరం ప్రచారం చేస్తూనే ఉండడంతో వ్యాపారులకు సౌకర్యంగా ఉంది.



- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

పెన్నమ్మను కుళ్లబొడుస్తున్నారు

మూడు రోజుల నుంచి ఇసుక, మట్టి తవ్వకాలు

విడవలూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండపరిధిలోని ముదివర్తిలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇసుక, మట్టి(తవట) తవ్వకాలను ప్రభుత్వం నిషేధించినా 'మాకు నిబంధనలు వర్తించవు' అంటూ ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. మూడు రోజుల నుంచి పెన్నాతీరంలో తవ్వకాలు జరుగుతున్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం ముదివర్తిలో ఇసుక, మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయమై స్థానిక రెవెన్యూ అధికారికి ఫిర్యాదులు రావటంతో ఆయన సంఘటనా స్థలానికి వెళ్లి తవ్వకాలను అడ్డుకున్నారు. అయితే వారిపై కేసులు నమోదు చేయకపోవటంతో అధికారుల ఆదేశాలను అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు. పెన్నా పరివాహక ప్రాంతంలో తవ్వకాలు మాత్రం ఆగలేదు.

మూడురోజులుగా ఇసుక, మట్టి తవ్వకాలు

ముదివర్తి గ్రామ సమీపంలో ఉన్న పెన్నాతీరంలో ఇసుక, మట్టి తవ్వకాలు గత మూడు రోజుల నుంచి జోరుగా జరుగుతున్నాయి. గ్రామానికి అనుకుని ఉన్న రీచ్‌లో కొందరు అక్రమార్కులు ఇసుక తవ్వుతుండగా, గాంధీ గిరిజన సంఘం అనుకుని ఉన్న పెన్నాతీరంలో సర్వేనెంబరు 1066-1లో 2 ఎకరాలు రెవెన్యూ అధికారులు డీఫారం పట్టా ఇచ్చారని ఓ వ్యక్తి మట్టిని తవ్వేస్తున్నాడు. ఇలా.. ఎవరు పడితే వారు పెన్నానదిలో తవ్వకాలు జరుపుతూ ఇసుకని, మట్టిని అక్రమంగా నెల్లూరు, కోవూరు,



కొడవలూరు, అల్లూరు మండలాలకు తరలిస్తున్నారు. ఇసుక, మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదుల అందినా, వారు చర్యలు తీసుకోకపోవటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. రోజుకి సుమారు 30 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక, మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు సుమారు రూ.1200నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తూ మండలాధికారులు, జిల్లా అధికారులకు సవాల్ విసురుతున్నారు.

ముదివర్తికి పొంచి ఉన్న 'ముంపు' ముప్పు?

పెన్నాతీరంలో అనుమతులు లేకుండా కరకట్టలను ధ్వంసం చేసి తవ్వకాలు జరుపుతుండటంతో వర్షాలు పడినప్పుడు గ్రామం ముంపునకు గురవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా వరదలకు గ్రామం నీట మునిగి చాలా ఇబ్బందులు పడ్డామని, పెన్నానదిలో తవ్వకాలు జరపరాదని ఎంత చెప్పినా అక్రమార్కులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లాధికారులు విచారణ జరిపి ఇసుక, మట్టిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

తవ్వకాలు జరిపితే చర్యలు

పెన్నాతీరంలో ఇసుక, మట్టి తవ్వకాల తవ్వకానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ లేవు. నదిలో తవ్వకాలను నిషేధించాం. ఒక వేళ ఎవరైనా తవ్వకాలు జరిపితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేయిస్తాం.

- చంద్రశేఖర్, తహసీల్దారు, విడవలూరు

వెలుగు వీవోఏలకు ఊరట

- మూడేళ్ల కాలపరిమితి జీవో నిలుపుదల
- ఎన్నికల హామీని నెరవేర్చిన ప్రభుత్వం
- జిల్లాలో 1,215 మంది వీవోఏలు
- విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల హర్షం

పొదుపు సంఘాల పుస్తక నిర్వహణ కోసం ఏళ్ల తరబడి గౌరవవేతనంతో వెలుగు(గ్రామీణాభివృద్ధిశాఖ) పథకంలో పనిచేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ)లకు కూటమి ప్రభుత్వం ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడేళ్ల కాలపరిమితిని నిలుపుదల చేస్తూ రెండు రోజుల కిందట ఉత్తర్వులు విడుదల చేసింది. ఎన్నికల్లో వీవోఏలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఎట్టకేలకు నెరవేర్చింది. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వీవోఏలు (ఫైల్)

సంగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ - వెలుగు పథకంలో వీవోఏలు ఎంతో కీలకం. పొదుపు పుస్తకాల నిర్వహణలో సంఘాల సభ్యులకు తోడ్పాటు అందించేందుకు సంప్రదాయ పేరుతో చేరి కొంతకాలం ఉచితంగా సేవలు అందచేశారు. వీరు నెలకొకసారి ప్రతి పొదుపు సంఘంతో సమావేశం నిర్వహిస్తారు. అంతేకాదు గ్రామ సమైక్య (గ్రామంలోని సంఘాలన్నీ కలిపి) మండల సమైక్య (మండలంలోని గ్రామ సమైక్యాలు) మధ్య వారధిగా పనిచేస్తారు. ఒక్కొక్క గ్రామ సమైక్యకు ఒక్కొక్క వీవోఏ బాధ్యత వహిస్తారు. గ్రామ సమైక్య పరిధిలో 20 నుంచి 30 పొదుపు సంఘాలు ఉంటాయి.

● జిల్లావ్యాప్తంగా 1,215 వీవోఏలు

జిల్లాలోని 38 మండలాల్లో 1,215 గ్రామ సమైక్యలు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామ సమైక్యకు ఒక్కొక్కరి చొప్పున జిల్లావ్యాప్తంగా 1,215 మంది వీవోఏలు ఉన్నారు. అందులో భాగంగా సంగం మండలంలో 22 మంది వీవోఏలు ఉన్నారు. మొదట వీరు పొదుపు పుస్తకాల నిర్వహణ చేసినందుకు ఆ సంఘం తరుపున నెలకు



సంగంలోని వెలుగు కార్యాలయం

రూ.50ల చొప్పున ఎన్ని సంఘాలు ఉంటే, అన్ని రూ.50 ఇచ్చే ప్రాతిపదికన పనిచేశారు. సంఘాలు సరిగా ఇవ్వకపోవడం తో ప్రభుత్వమే రూ. 2000లు గౌరవ వేతనం ఇచ్చేది. దాన్ని ఆ తరువాత రూ.3వేలకు పెంచా రు. గత టీడీపీ ప్రభుత్వంలో గౌరవవేతనాన్ని రూ. 8,000లకు పెంచారు.

మూడేళ్ల కాలపరిమితి నిలుపుదల

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ సానుభూతి మహిళలను చేర్చుకునే ఉద్దేశ్యంతో వీవోఏల మూడేళ్ల కాలపరిమితిని తొలగించింది. వీవోఏగా మూడేళ్లు కాలపరిమితి పూర్తైతే వారి స్థానంలో కొత్త వారిని నియమించుకునేలా జీవో తీసుకువచ్చింది. దీంతో అప్పట్లో వీవోఏలు జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేశారు. కానీ వైసీపీ వారి ఆందోళనకు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ జీవో ప్రకారం వారికి ఇష్టంలేనివారిని కొన్నిచోట్ల తొలగించి ఆ పార్టీ సానుభూతి కుటుంబాల వారిని వీవోఏలుగా తీసుకున్నారు.

● ఎన్నికల హామీ నెరవేర్చిన ప్రభుత్వం

ప్రస్తుత సీఎం ఉన్న చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే వీవోఏల మూడేళ్ల కాలపరిమితిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రెండు రోజుల కింద కూటమి ప్రభుత్వం వీవోఏల మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చినట్లయింది.

● వీవోఏల హర్షం

దురుద్దేశ్యంతో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడేళ్ల కాలపరిమితిని ప్రభుత్వం నిలుపుదల చేయడంతో వీవోఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 ఏళ్లగా పనిచేస్తున్న వీవోఏలను గత ప్రభుత్వం ఆ పార్టీ సానుభూతి కుటుంబాల మహిళలను, యువతులను వీవోఏలుగా కట్టబెట్టేందుకు పన్నిన పన్నాగాన్ని ప్రభుత్వం నిలుపుదల చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిందని వారు పేర్కొన్నారు.

గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

ఏఎస్ పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన ఏఎస్‌పేట మండలం చిరమన గ్రామ సమీపంలో చోటు చేసుకోంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... చిరమన గ్రామానికి చెందిన ఉడత మాల్యాద్రి (44) ఇంటికి సరుకులు తీసుకొచ్చేందుకు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై హసనపురం గ్రామానికి వెళ్లి సరుకులు తీసుకుని తిరిగి వస్తుండగా చిరమన గ్రామ సమీపంలోకి రాగానే ఆకస్మత్తుగా గేదె అడ్డు రావడంతో ఢీకొని పడిపోయాడు. దీనితో తలకు తీవ్ర గాయం అయింది. స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న గడ్డం నాగరాజు

ఆత్మకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ఢీకొని ఆత్మకూరు పట్టణానికి చెందిన డగ్గం నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు డిపోకు చెందిన ఏఎస్ పేటకు వెళ్లే బస్సు బస్టాండ్ సెంటర్‌లో మలుపు తిరుగుతుండగా ప్రమాదవశాత్తు నాగరాజు బస్సు కింద పడ్డాడు. దీంతో అతని ఎడమ కాలు నుజ్జునుజ్జు అయింది. చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

పార్క్ చేసిన బైక్ దహనం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటనపై ఆదివారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని కుమ్మరివీధిలో ఎమ్‌డీ ఫయిరోజ్ ఖాన్ నివాసం ఉంటున్నారు. పది రోజుల కిందట ఆయన బైక్ పంచర్ కావడంతో ఇంటి ముందు పార్క్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు బండికి నిప్పంటించారు. బైక్ మంటల్లో కాలిపోతుండటం గమనించిన పొషాద్ అనే వ్యక్తి ఫయిరోజ్ ఖాన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అక్కడకు వెళ్లి చూడగా బైక్ దగ్ధమైం ది. దీంతో ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

● ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్




సమావేశంలో మాట్లాడుతున్న గణేష్ కుమార్ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి గణేష్ కుమార్ యాదవ్ ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతల వ్యక్తి గత అభిప్రాయాలు, ఎదురవుతున్న సమస్యలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కూటమి ప్రభుత్వం పై ప్రజలలో ఉన్న మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టం తెచ్చారని, దాని వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దానిని తీసేయాలని భావిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలను గత వైసీపీ ప్రభుత్వం నిలువునా ముంచేసిందని, కూటమి ప్రభుత్వం దగా చేస్తుంద ని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సమస్యగా మారాయని, ఎటు చూసినా కూటమి, వైసీపీ నేతల మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని దిశ నిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలని, తద్వారా పార్టీ బలోపేతం అవుతుందని చెప్పారు. ఈనెల 15వ తేదీలోగా ఓట్ చోరీపై ప్రజల సంతకాల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయని, దీని ప్రభావరం ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఉంటుందన్నారు. 2029లో కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ అధికారాన్ని హస్తగతం చేసుకునే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమశిల జలాశయాన్ని ఆధునీకరించాలి

- ఎకరాకు ఐదు బస్తాల యూరియా ఇవ్వాలి
- జిల్లా రైతు సంఘం మహాసభలో నాయకుల తీర్మానం
- 30 మందితో నూతన కమిటీ ఏర్పాటు



రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పూడిపర్తి జనార్దన్, వెంగయ్య

నెల్లూరురూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతాంగానికి జీవనాడైన సోమశిల జలాశయాన్ని ఆధునీకరించి భవిష్యత్ తరాలకు ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలో తీర్మానించారు. ఆదివారం నెల్లూరు రూరల్లోని ములుముడి గ్రామంలో జరిగిన మహాసభలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్య దర్శి మూలం రమేష్, మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడారు. సోమశిల జలాశయా న్ని పూర్తిగా ఆధునీకరించాలని, పెన్నా పొర్లు కట్టలను బాగు చేసి సమీప రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. పెన్నా జలాలు అందే ప్రాంతాలలో చెరువులు, కాలువలను ఆధునీకరించాలని సూచించారు. ప్రభుత్వం ఎకరానికి మూడు కట్ట లు మాత్రమే యూరియా ఇస్తామని ప్రచారం చేస్తుందని, ఐదు కట్టలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు యూరియా మీదనే ఆధారపడి ఉన్నందున యూరియా కొరత తీసుకురావద్దని తెలిపారు. అనంతరం రైతు సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పూడిపర్తి జనార్దన్, మూలి వెంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో కలిపి 30 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీరాములు, తుళ్లూరు గోపాల్, చంద్రమౌళి, మాదాల వెంకటేశ్వర్లు, ఆలూరు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మృతదేహాలకు పోస్టుమార్టం

కలువాయి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంలో కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న వింజం కొండయ్య, రత్నమ్మ దంపతుల మృతదేహాలకు ఆదివారం పోలీసులు పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.


కామాక్షితాయి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి కుంచం మహేశ్వరరావు కుటుంబ సమేతంగా శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వేద పండితులు స్వామి, అమ్మవారి శేష వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట కమిటీ సభ్యులు శివకృష్ణ, నందకుమార్, సుమలత, వరలక్ష్మి, చాముండేశ్వరి, శ్రీనివాసులు, ప్రత్యూష, సుధాకర్, సుధారాణి, శారద, ఎక్స్ అఫిషియో సభ్యుడు శివ గంగా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ స్థితి, ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

శ్రీశైలం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా వాయుగుండ్ల వెంకటేష్



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా వర్ష్యూ లైఫ్ స్పేస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఎండీ వాయుగుండ్ల వెంకటేష్ నియమితులయ్యా రు. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారిగానే కాక పలు ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పదవి లభించింది. తమ సంస్థ అధినేతకు శ్రీశైలంలో భక్తులకు సేవ చేసే అవకాశం లభించడంపై ఆ కంపెనీ సీజీఎంలు అబినవరాజు, సుధాకర్, సత్తార్, విజయకుమార్, కాంచనప్రసాద్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సోమశిలకు 16,933 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 16,933 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 73.807 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువకు 2,600, ఉత్తర కాలువకు 50, కండ లేరుకు 3,800 క్యూసెక్కులు వదులుతున్నారు.



నెల్లూరు : వీఆర్సీ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

దళితులపై దాడులు ఆపాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పాలనలో దేశంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులను నిలపాలంటూ ఆదివారం ఆయన నగరంలోని వీఆర్సీ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బీజేపీ నేత చెప్పు విసిరాడని, ఇంతకంటే అవమానం ఏముంటుందని ప్రశ్నించారు. గతంలో ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగలేదని, గవాయ్ దళితుడు కనుకే ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్నారు. ఈ ఘటన జాతికి జరుగుతున్న అవమానమని, దళితులకు జరుగుతున్న అవమానాలు చూస్తూ సహించలేకపోతున్నామన్నారు. డీజీపీగా ఉన్న ఓ దళితుడు తొమ్మిది పేజీల సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నాడని, అతనిని విపరీతమైన ఒత్తిడికి లోను చేసి పేరేపించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలో అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టపగలు తగలు పెట్టారని, ఇలా చెప్పుకుంటే పోతే అన్ని ప్రాంతాల్లో దళితులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వీటిని కాంగ్రెస్ పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు.

ఉర్రూతలూగించిన మ్యూజికల్ నైట్



యాదే కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్‌లో పాటలు పాడుతున్న జావిద్ బృందం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హిందీ సినిమా రంగంలో నటుడు, నేపథ్య గాయకుడు, నిర్మాత, సంగీత దర్శకుడు, పాటల రచయిత, హాస్యరస చక్రవర్తి కిషోర్‌కుమార్. ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి నెల్లూరు పురమందిరంలో కిషోర్ కుమార్ అభిమాన గాయకులు జావీద్ ఆధ్వర్యంలో యాదే కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ ఆలపించిన నవరస సినీగీతాలను జావీద్ బృందం ఆలపించి శ్రోతలను మైమరిపించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు తమ వంతు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో జావీద్, అమానుల్లా ఖాన్, సుజాత, రబీనా, జీలు, షఫీ, షబ్బీర్, గౌస్‌బాషా ఆలపించిన సుమధుర గీతాలు శ్రోతలను మైమరిపించాయి. హాజరైన పురప్రముఖులు గాయకులను, వాయిద్య సహకారం అందించిన కళాకారులను సన్మానించి అభినందించారు.

లాడ్జీలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

- తెరుచుకోని గదుల తలుపులు
- భయంతో ప్రజల ఆర్తనాదాలు
- తప్పిన పెనుప్రమాదం



అగ్నికి ఆహుతైన లాడ్జీ గదిని పరిశీలిస్తున్న పోలీసులు



బాధితుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(క్రైం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలోని హోటల్ బ్లూ మూన్ లాడ్జీ రెండవ అంతస్థులో రూమ్ నెంబరు 102లో శనివారం అర్ధరాత్రి ఏసీ షార్ట్‌షర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఆ గదిలోని బెడ్స్, ఫర్నీచర్, సీలింగ్ పూర్తిగా కాలిపోవడంతో పొగ పక్కనే ఉన్న రూమ్‌లకు వ్యాపించింది. అదే సమయంలో కరెంట్ పోవడంతో రూమ్‌లలో దాదాపు 15 మంది తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా సెన్సార్ డోర్లు కావడంతో తెరుచుకోలేదు. దీంతో గదుల్లోని ప్రజలు కిటికీల వద్దకు వచ్చి ప్రాణ భయంతో గట్టిగా కేకలు వేయడాన్ని గమనించిన స్థానిక ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండు ఫైర్ ఇంజన్‌లతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గదిలోని మంటలను ఆర్పారు. మరో టీమ్ హోటల్ వెనుక ఉన్న ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి గేట్లు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. డోర్ బ్రేకర్స్‌ను ఉపయోగించి తలుపులు పగులకొట్టి జనాలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, నగరంలోని అన్ని పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఏఆర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సేవలు అందించారు. ఈ ఘటనలో చిన్న బాబుతోపాటు ఆ చిన్నారి తల్లిదండ్రులు పొగపీల్చడం వల్ల అస్వస్థతకు గురికావడంతో రూరల్ డీఎస్పీ జీ.శ్రీనివాసరావు వారిని వెంటనే కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది కే.చంద్రశేఖర్, టీ.శ్రీనివాసులు, వారి సిబ్బంది రిస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. లాడ్జి యజమాని మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు అగ్నిమాపక సిబ్బంది రూ.5లక్షలు నష్టం జరిగినట్లు భావిస్తున్నారు. అయితే మంటలు పక్క గదులకు వ్యాపించక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కాగా అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లలు వేర్వేరుగా సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

ముంబై హైవేపై లారీ, కారు ఢీ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

మర్రిపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై మర్రిపాడు వద్ద ఆదివారం లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బద్వేలు వైపు వెళ్తున్న లారీని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆటోలో మర్రిపాడు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11731
వెండి కిలో ధర	రూ. 1,67,100
వెండి ఒక గ్రాము	రూ.175.00

సక్షమ్ ఆధ్వర్యంలో నేత్రదానం

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో చిరువ్యాపారి కనమర్లపూడి శేషగిరిరావు(78) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా ఆయన రెండు నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ వైద్యులు ఆయన నేత్రాలను సేకరించారు.

ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు

● టీడీపీ నేతల ధ్వజం



ఉదయగిరి: విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని టీడీపీ మండల కన్వీనర్ చింతన బోయిన బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభి వృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ మేక పాటి రాజగోపాల్‌రెడ్డిలు విమర్శించడం సిగ్గు చేటన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవు తుంటే వైసీపీ నాయకులు అవాకులు, చవా కులు పేలడం సరికాదన్నారు. ప్రజలే వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, అనంతశెట్టి ఏడుకొండలు, నల్లిపోగు నరసింహ, మట్ల రామయ్య, లక్ష్మయ్య, ఉప్పుటూరి పెదవెంకటయ్య, గాజుల బాబు, నవాజ్, దారపనేని నారాయణ, బొజ్జా నరసింహరావు, ఖాన్‌షా, సుబ్బారెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ భయపడే పార్టీ కాదు

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): అధికారం కోల్పోయి గ్రామాల్లో మనుగడ కోసం వైసీపీ నాయకులు ఆరాచకాలు సృష్టించేందుకు ఎన్ని ఎత్తులు వేసినా టీడీపీ భయపడే పార్టీ కాదని మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన హయాంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని ఎంతమేర అభివృద్ధి చేశారో గుర్తుంచుకోవాలన్నారు. తన ప్రాంతాల్లో అభివృద్ధి మరిచి మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వివాదాలు సృష్టించాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, ఎమ్మెల్యే కాకర్లను విమర్శిస్తే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, వైస్ ఎంపీపీ డీ.మధు, నక్కలగండి చైర్మన్ వేమూరి మధు, జనసేన పార్టీ మండల కన్వీనర్ పఠాన్ రసూల్, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, ముజ్జే లక్ష్మీనారాయణ, పోకా మహేశ్వరరావు, చంద్ర వెంకయ్య, ఆంద్రా నాగిరెడ్డి, ఆవుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మాలేపాటికి నాయకుల పరామర్శ



మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

కావలి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌స్ట్రోక్‌తో శస్త్రచికిత్స చేయించుకుని తాడేపల్లిలోని మణిపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడిని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. రాజ్యసభసభ్యులు బీద మస్తాన్‌రావు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావులు మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమెరికా నుంచి మాలేపాటి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా, విక్రయాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ అన్వర్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రానున్న దీపావళి నేపథ్యంలో పెద్దఎత్తున బాణసంచా విక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున వ్యాపారులు తప్పకుండా పోలీసు, రెవిన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందాలన్నారు. బాణసంచా హోల్‌సేల్ వ్యాపారులు నిల్వ గోదాముల్లో తగు భద్రతా ప్రమాణాలు పాటించాలని, రిటైల్ వ్యాపారులు బహిరంగ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటుచేసుకోవటంతో పాటు ప్రతి దుకాణం వద్ద ఓ నీళ్ల డ్రమ్ము, పొడిఇసుక, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటుచేసుకోవాలని స్పష్టంచేశారు. కందుకూరు సర్కిల్ పరిధిలోని మండలాల్లో ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, తయారీకేంద్రాలు ఉంటే పోలీసులకు ముందస్తు సమాచారం అందించటం ద్వారా ప్రమాదాలు అరికట్టాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

టపాసుల దుకాణాలకు అనుమతులు తీసుకోవాలి

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణాలకు తప్పనిసరిగా రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాసుల విక్రయ దుకాణాలకు అనుమతులు లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. టపాసుల దుకాణాలను ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి): కావలి మండలం తాళ్లపాలెంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అరగల వెంకమ్మ (60) నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రూరల్ పోలీసులు కథనం మేరకు, తాళ్లపాలెంకు చెందిన వెంకమ్మ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. భర్త, కుమారుడు మొదట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఓగూరు సర్పంచి యనమద్రి సుబ్బారావు

కందుకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం ప్రదాన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఓగూరులో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ. 20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్ భవనాన్ని ప్రారంభించి రూ. 10 లక్షల పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో గ్రామంలోని యువకులు, మహిళలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓగూరు గ్రామాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కందుకూరు మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు 22 కోట్ల రూపాయల జేఎంఎం నిధులు మంజూరు చేయగా టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

టీడీపీలో చేరిన ఓగూరు సర్పంచి

ఓగూరు గ్రామసర్పంచి యనమద్రి సుబ్బారావు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన వెంట టీడీపీలోకి విచ్చేసిన 10 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, దామా మల్లేశ్వరరావు, బోగినేని వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్లు, అల్లం రాధయ్య, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జలదంకి-తెల్లపాడు రహదారి విస్తరణ పనుల ప్రారంభం



అన్నవరం సమీపంలో జలదంకి-తెల్లపాడు రోడ్డుపై నిర్మాణంలో ఉన్న వంతెన

జలదంకి, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): జలదంకి-తెల్లపాడు రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కొంతకాలం గా బిల్లులు రాలేదన్న కారణంతో గుత్తేదారు పనులు ఆపేసిన సం గతి తెలిసిందే. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో గుత్తేదారుకు బిల్లులు అందడంతో రోడ్డు విస్తరణ ప నుల్లో భాగంగా వాగులపై నిలిచి ఉన్న వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించారు. అన్నవరం, దాసరిఅగ్రహారం క్రాస్‌రోడ్డు, తిమ్మసముద్రం లహరిఫామ్స్ సమీపాన, క్రాకుటూరు రోడ్డు మలుపు వద్ద నాలుగు చోట్ల వంతెనల పనులు జోరుగా సాగుతున్నాయి.

నేటి నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అనంతసాగరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ నమోదు చేసుకోని గిరిజనుల కోసం సోమవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గిరిజనులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

కోటూరుపల్లిలో దర్గా ప్రారంభం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్థులు

కలువాయి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటూరుపల్లిలో పునర్నిర్మించిన మసుంషావల్లి దర్గాను ఆదివారం ప్రారంభించారు. నెల్లూరులో నివాసం ఉంటున్న గ్రామానికి చెందిన చాంద్‌బాషా తన స్వంత నిధులతో దర్గాను పునర్నిర్మించారు. ఆదివారం దర్గాను ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక



శాలివాహన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి సుబ్బారావు

కందుకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గం కుమ్మరి శాలివాహన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అద్దంకి సుబ్బారావు నేతృత్వంలో పట్టణంలోని జనార్ధనస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడుతూ కుమ్మరులకు చట్టసభలలో ప్రాతినిధ్యం దక్కటమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం అధ్యక్షుడిగా కలికివాయి కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా కలికివాయి మాల్యాద్రి, గౌరవ సలహాదారులుగా డా.ఉప్పుటూరి వెంకయ్య, డా. కరేటి రామరాఘవులు, కార్యదర్శిగా అద్దంకి మాల్యాద్రి, కోశాధికారిగా ముసిలి మడుగు కొండయ్య, ఉపాధ్యక్షుడుగా కలికివాయి నవీన్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మొగిలిచర్ల సుబ్బారావు, కెఎస్ నర్సయ్య, పెళ్లూరు శ్రీనివాసులు, ఎడవల్లి వెంకటేశ్వర్లు, చింతకుంట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు బాగు చేయండి సారూ..



మరమ్మతులకు గురైన చేతిపంపు

సంగం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో షాది మంజిల్ పక్కన ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురై గత కొంతకాలంగా పనిచేయక పోవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. పంచాయతీ కుళాయిలు ఉన్నా కరెంటు ఉంటేనే నీళ్లు వస్తాయి. కూలి పనులకు వెళ్లేవారు కుళాయి నీళ్లు పట్టుకోలేకపోతే ఇక ఆరోజు నీళ్లు లేనట్లే. అదే చేతిపంపు పనిచేస్తుంటే నీళ్లు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన చేతిపంపును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కంపోస్టు యార్డు కంపు మట్టి మాకొద్దు...!

● లబోదిబోమంటున్న టిడ్కో గృహాల నివాసితులు



టిడ్కో గృహల వద్ద రోడ్డు మార్జిన్లలో వేసిన ప్లాస్టిక్, మట్టి

కావలి (టౌన్) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బయోప్లాస్టిక్ మట్టి అంటూ కంపోస్ట్ యార్డు నుంచి మట్టిని మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో వేస్తుండడంతో ఆ దుర్వాసన భరించలేక పోతున్నామని గృహ సముదాయాల నివాసితులు వాపోతున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమనే మాట పక్కన పెడితే... చెత్త నుంచి సమస్యలు సృష్టిస్తున్నారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను డీకంపోస్ట్ చేసి బయోప్లాస్టిక్ మట్టిని తోలుతున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నప్పటికీ, మట్టి నల్లగా దుర్వాసన వెదజల్లడంతో పాటు, అందులో గాజు ముక్కలు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసివున్నాయని అంటున్నారు. ఈనేపథ్యంలో ఆదివారం సీపీఎం నాయకుడు టిడ్కో గృహ సముదాయాన్ని సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. కావలి పట్టణం 40 వార్డుల విస్తీర్ణంలో ఉంటే దుర్వాసన వెదజల్లే కంపోస్ట్ యార్డు మట్టిని ఇక్కడే తోలడమెందుకని, పేదలంటే అంత చిన్నచూపా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలు సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు మరిన్ని సమస్యలు సృష్టించడం సమంజసం కాదన్నారు.

ఘనంగా శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే



యూనివర్సిటీ టాపర్ సయ్యద్ ముస్కాన్‌ను అభినందిస్తున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలి (టౌన్) అక్టోబరు 12: మద్దూరుపాడులోని కన్వెన్షన్ హాలులో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే ఆదివారం ఘనంగా జరిగింది. చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బరామయ్య, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, కళాశాల కరస్పాండెంట్, ప్రముఖ వైద్యుడు బెజవాడ రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఉత్తమ బోధనతో పాటు ఉపాధి కల్పనకు కృషి చేస్తుందన్నారు. బీఎస్సీ బయోటెక్ యూనివర్శిటీ టాపర్ ముస్కాన్, పట్టణ టాపర్లను, ఉత్తమ క్రీడాకారులను బహుమతులతో అతిథులు అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు పి జానకీరామ్, రవికుమార్, జూనియర్ కళాశాల డైరెక్టర్లు నందనవనం మధుసూదనరావు, వెంకయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళ వైద్యానికి ఆర్థిక సాయం



బాధితులకు నగదు సాయమందిస్తున్న బెస్ట్ వాకర్స్

కావలి (టౌన్) అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ పేద మహిళ వైద్యానికి కావలి బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రూ. 16,000 ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట శేషయ్య మాట్లాడుతూ ప్రతినెలా ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. తుమ్మలపెంటకు చెందిన మాణిక్యాల శేషమ్మ గుండె జబ్బుతో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తమ దృష్టికి రావడంతో చేయూతనందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వైట్‌హౌస్ కొండపనాయుడు, మందా వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నల్లపరెడ్డి శ్రీనివాసులు, రైటర్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ కుమార్, ఆర్టీసీ గౌస్, సుంకు కృష్ణ, జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధం

ఆత్మకూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలు దుకాణాల్లో, కూరగాయల మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉంటే జరిమానా విధించామన్నారు. మార్కెట్‌లో కూరగాయల కొనుగోలుకు వచ్చేవారు తప్పనిసరిగా సంచి తెచ్చుకోవాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం


ఉదయగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ పోస్టుకు అతిథి అధ్యాపకుని నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీ ఫిజిక్స్ పీజీలో 55 శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ మరియు అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు మంగళవారం వరకు స్వీకరిస్తారని, బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వం మారినా... మారని అధికారుల తీరు



వైద్యశాలలో జగన్ ఫొటోతో ఉన్న వాల్‌పోస్టర్


ఉదయగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా అధికారుల తీరు మారడంలేదు. అందుకు ఉదాహరణే ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉన్న వాల్‌పోస్టర్. వైద్యశాలలో గత ప్రభుత్వ హయాంలో ఓపీ విభాగం వద్ద ఏర్పాటుచేసిన జగన్ ఫోటో ఉన్న వాల్‌పోస్టర్ నేటికీ దర్శనమిస్తోంది. దానిని చూసిన ప్రతిఒక్కరూ ఇక్కడ అధికారులు గత ప్రభుత్వాన్ని మర్చిపోలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



అదిగదిగో పులి

● వేద వర్సిటీలో సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించింది. హాస్టల్ వద్ద దీని జాడలు కనిపించాయి. ఈ విషయమై విద్యార్థులు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు ఉనికిని గుర్తించి సెల్ ఫోన్‌లో చిరుత సంచారాన్ని చిత్రీకరించారు. కొంత కాలం క్రితం ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వెనుక చిరుతను బంధించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మళ్లీ యూనివర్సిటీల్లో చిరుత సంచారం ఆందోళన కలిగిస్తోంది. ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో వర్సిటీల పరిసరాల్లో తిరుగుతున్నట్లు భావిస్తున్నారు.



ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు: 2,368
నియామక నోటిఫికేషన్ ఇచ్చింది: 1,478
డీఎస్సీకి దరఖాస్తు చేసింది: 23,500 మంది
రాత పరీక్షకు అర్హత సాధించింది: 21,340
పరీక్ష రాసింది: 19,550
టీచర్లుగా ఎంపికైంది: 1,403
శిక్షణ, కౌన్సెలింగ్‌కు హాజరైంది: 1,394
గైర్హాజరైంది: 7 మంది

చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

● ఆర్ టి బెస్ట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడులకు సోమవారం నుంచి 1,394 మంది కొత్త టీచర్లు రానున్నారు. మెగా డీఎస్సీ-2025 కింద ఎంపికైన వీరిని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నియమించారు. 2018లో టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లలో డీఎస్సీ మాటే ఎత్తలేదు. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. ఆ ప్రకారం కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,403 మంది ఎంపికయ్యారు. వీరికి సెప్టెంబరు 25న విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నియామక పత్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటికి 1394 మంది అభ్యర్థులు హాజరుకాగా.. శిక్షణలో చివరి రెండు రోజులైన గురు, శుక్రవారాల్లో స్థానాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయ్యాయి. కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన బడుల్లో సోమవారం కొత్త టీచర్లు చేరనున్నారు. కాగా, వివిధ కారణాలతో శిక్షణకు గైర్హాజరైన ఏడుగురికి త్వరలో విజయవాడలో శిక్షణ ఇచ్చి.. కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించనున్నారు.

ఇవి వెంట తీసుకెళ్లాలి

కొత్త టీచర్లు కౌన్సెలింగ్ ప్రొసీడింగ్స్ కాపీలు మూడు తీసుకెళ్లాలి. ఒకటివారు పనిచేయనున్న స్కూలుకు, మరొకటి ఎంఈవో కార్యాలయానికి, చివరిది తన వ్యక్తిగత ఫైల్‌లో ఉంచుకోవాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎంపికైన టీచర్లు

నియోజకవర్గం	మొత్తం ఖాళీలు	డీఎస్సీ ద్వారా భర్తీ
చంద్రగిరి	28	14
చిత్తూరు	94	45
జీడీ నెల్లూరు	58	30
కుప్పం	887	579
మదనపల్లె	96	29
నగరి	52	15
పలమనేరు	456	284
పీలేరు	72	42
పుంగనూరు	114	48
పూతలపట్టు	68	39
సత్యవేడు	107	66
శ్రీకాళహస్తి	64	32
తంబళ్లపల్లె	178	116
తిరుపతి	89	55
మొత్తం	2363	1394



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

బాలాజీ రైల్వే డివిజన్‌కోసం ముందడుగు

సాధన కోసం తిరుపతిలో ఏకమైన రాజకీయ, ప్రజాసంఘాలు

తిరుపతి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1990లో పురుడు పోసుకున్న బాలాజీ రైల్వే డివిజన్ నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీని సాధన కోసం తిరుపతిలోని రాజకీయ, ప్రజా సంఘాలు ఏకమయ్యాయి. ఉద్యమం ద్వారానైనా సాధించేందుకు ముందడుగు వేశాయి. ఇందులో భాగంగా ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. రైల్వే డివిజన్ సాధనకోసం చేసిన ప్రయత్నాలు, వచ్చినట్టే వచ్చి గుంటూరుకు వెళ్లిపోవడం, డివిజన్ రావడంలో ప్రయోజనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ వివరించారు. 'బాలాజీ డివిజన్ రాకపోవడానికి రాజకీయ పరిణామాలే కారణం. ప్రాంతీయ అసమానతలను పురికొల్పేలా కాకుండా రాయలసీమకు న్యాయం చేయాలి. 35 ఏళ్ల కలను సాకారం చేసుకునే దిశగా బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి పోరాటం సాగిస్తుంది. తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు మా హక్కు అన్న 'సీమ' ప్రజల నినాదాన్ని ముందుకు తీసుకెళ్దాం. కేంద్ర ప్రభుత్వాన్ని ట్యాగ్ చేస్తూ ట్విట్టర్ ద్వారా డిమాండును తెలియజేద్దాం' అని గిరిధర్ తెలిపారు. డివిజన్ ఏర్పాటుకు వనరుల ఇబ్బంది లేదని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు తెలిపారు. గుంతకల్లు డివిజన్లోని పాత ఇనుము అమ్మితే రూ.20 వేల కోట్లు వస్తుందని, అమరరాజ ఫ్యాక్టరీ అవతల స్థలమూ ఉందన్నారు. తిరుపతికి వచ్చే ప్రయాణికులకు సదుపాయాలు, పర్యాటకంగా మరింత అభివృద్ధి రైల్వే డివిజన్‌తోనే సాధ్యమవుతుందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిలో రైల్వే డివిజన్ కీలక పాత్ర పోషిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. బాలాజీ రైల్వే డివిజన్ కావాలన్న ప్రజల బలమైన ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తెలిపారు. ఈ ఉద్యమానికి ఎంపీల సహకారం తీసుకోవాలని బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి సూచించారు. పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలతో బాలాజీ డివిజన్ డిమాండ్‌ను లేవనెత్తిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కందారపు మురళి చెప్పారు. అంతకుముందు రైల్వే స్టేషన్ నుంచి ఆటో, జీప్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు 'మనందరి విజన్- రైల్వే డివిజన్' బ్యానర్ పట్టుకుని నినాదాలతో ర్యాలీగా కచ్చపి ఆడిటోరియానికి వచ్చారు. ఈ సమావేశంలో టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, సామాజికవేత్త పీసీ రాయల్, బీఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకుల సతీష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.చౌదరి, న్యాయవాది దినకర్, శ్రీకాళహస్తి బోర్డు మాజీ సభ్యుడు మహీధర రెడ్డి, పోస్టల్ యూనియన్ నాయకులు శ్రీధర్ బాబు, ఫిల్మ్‌సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ నేత ఆముదాల తులసీరాం, ఐటీ నిపుణులు, పోస్టల్, ఆర్టీసీ, ఉపాధ్యాయ, విద్యార్థి, మర్చంట్ అసోసియేషన్ల నాయకులు, ఎస్వీయూ ప్రొఫెసర్లు, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వేదికగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గతంలో సమర్పించిన అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చునని పేర్కొన్నారు. అదేవిధంగా సంబంధిత వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవచ్చునని వివరించారు. ప్రజలు అర్జీలను అందజేసి, రసీదులు తీసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారమైతే మొబైల్‌కు సమాచారం వస్తుందని తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపునకు ఆదేశాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆలయం పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'తిరుపతిలో రెవెన్యూ దేవస్థానం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆర్డీవో రామ్మోహన్ స్పందించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని అర్బన్ తహసీల్దారు సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కొన్ని కట్టడాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఈ నిర్మాణాలు ఇబ్బందిగా ఉండటంతో గతంలో ఆందోళనలు సైతం చేపట్టారు.

స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్..!

● పద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపు రద్దుకు నిర్ణయం
● లాభాపేక్ష లేకుండా సొంతంగా నిర్వహించేందుకు కసరత్తు



స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడనుంది. లాభాపేక్ష లేకుండా సొంతంగానే మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ నిర్ణయం తీసుకోనుంది. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందుల పెత్తనం స్విమ్స్‌లో చాపకింద నీరులా పాకింది. శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో షాపును దక్కించుకుని లక్షలాది రూపాయలు ఆర్జించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా సదరు షాపునకు టెండరు జరిగినప్పటికీ మాఫియా ఉచ్చులో నుంచి బయటకు రాలేకపోయింది. ఈ పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' పలుసార్లు కథనాలను ప్రచురించింది. ఈ క్రమంలో షాపును రద్దు చేసేందుకు టీటీడీ సిద్ధమైంది.

మాఫియాకు షాక్ : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జన ఔషధి మెడికల్ షాపుల పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరో మెడికల్ షాపులు నామమాత్రపు అద్దెకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. వాటిని రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. స్విమ్స్ ఓపీల వద్ద ఉండే షాపును రద్దుచేయగలిగారు గాని పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. టీటీడీ మూడుసార్లు టెండర్లు పిలిచింది. అసాధారణ నిబంధనలు పెట్టడం వలన టెండరులో పాల్గొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తిచూపలేదు. తాజాగా ఆగస్టులో నాలుగోసారి టెండరు పిలిచారు. ఇందులో ఎక్కువ ధరకు కోట్ చేసిన ఇన్నోవేటివ్ ఫార్మా అధిక బిడ్డర్‌గా అర్హత సాధించింది. అయితే టెండరు జరిగి నెలరోజులు దాటినా అధిక బిడ్డర్‌కు కేటాయించకుండా మాఫియా అడ్డుకుంది. ఈ నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ నిర్ణయం అమల్లోకి వస్తే మాఫియాకు చెక్ పడినట్టేనని చెప్పుకోవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పోలెండ్ అమ్మాయి.. శేషాపురం అబ్బాయి

చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమకు ఎల్లలు ఉండవని నిరూపించారు చంద్రగిరి మండలానికి చెందిన యువకుడు, పోలెండ్ దేశానికి చెందిన ఓ అమ్మాయి. వీరిద్దరూ ప్రేమించుకుని ఒక్కటయ్యారు. చంద్రగిరి మండలం శేషాపురం గ్రామానికి చెందిన కనుమూరి మురళీధర్ నాయుడు, దేవకి దంపతుల కుమారుడు దేవ శివసాయి మురారీ జర్మనీలోని ఓ మెడికల్ కంపెనీలో ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేస్తున్న పోలెండ్ దేశానికి చెందిన యావ్ గోర్జాత్‌ని ప్రేమించాడు. తమ ప్రేమ విషయాన్ని వీరిద్దరూ తల్లిదండ్రులకు వివరించారు. వారు సరే అన్నారు. కాశిపెంట్ల వద్ద ఏజేపీ రిసార్ట్స్‌లో శనివారం రాత్రి వీరి వివాహం జరిగింది.



అయినా డ్రోన్ పట్టేసింది

● పాడుబడ్డ భవనంలో 'మత్తు' తీసుకుంటున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చుట్టూ ఎవరూ లేరనుకున్నారు. తమను ఎవరూ గమనించలేదనుకున్నారు. అలా పాడుబడ్డ బంగ్లాలోకి వెళ్లిన ఇద్దరు యువకులు మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్నారు. మత్తులో తేలిపోతున్న ఆ యువకులను పోలీసు డ్రోన్ పట్టేసింది. డ్రోన్ కెమెరా ద్వారా ఆ దృశ్యాలను చూసిన కమాండ్ కంట్రోల్‌లోని సిబ్బంది సమాచారంతో తిరుపతి వెస్ట్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్న ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. ఈ ఘటన ఆదివారం తిరుపతి ఇరిగేషన్ కార్యాలయం వెనుకవున్న పాడుబడ్డ బంగ్లాలో చోటుచేసుకుంది. లీలామహల్‌కు చెందిన పవన్, శ్రీనగర్‌కు చెందిన కుమార్ మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాలు తీసుకుంటుండగా డ్రోన్ కెమెరాతో గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పవన్ తిరుపతిలోని కొన్ని ప్రాంతాల్లో వాటర్ క్యాన్లు సరఫరా చేస్తున్నాడు. ఇతడి స్నేహితుడు కుమార్ డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. వీరి నుంచి రెండు మత్తు ఇంజెక్షన్లు, డ్రగ్స్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారిని వైద్య పరీక్షల నిమిత్తం రుయాకు తరలించారు. తిరుపతిలో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించడంలో డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. కాగా, ఆ ఇద్దరు యువకులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ చెప్పారు. వీరిని సోమవారం అర్బన్ తహసిల్దార్ ఎదుట హాజరుపరస్తామన్నారు. తమ పరిధిలో ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్న యువకులు

డ్రోన్ ఎగురుతూ ఉంటుంది

శివారు ప్రాంతాలు, పాడుబడిన భవనాల వద్ద ఎవరూ చూడరనే ఉద్దేశ్యంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బుక్ అయిపోతారు. ఎందుకంటే అలాంటి చోట్ల పోలీసు డ్రోన్.. ఆకాశాన తిరుగుతూ, కెమెరాలతో నిఘా పెట్టి ఉంటుంది. భవిష్యత్తులో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట వంటి ప్రాంతాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, హాస్టళ్ల వద్ద డ్రోన్లతో పర్యవేక్షణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

చిల్లకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చిల్లకూరు దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ఛైర్మన్‌గా దువ్వూరు దశరథరామిరెడ్డి, సభ్యులుగా ఆనిమెళ్ల సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, తూపిలి పద్మమ్మ, దువ్వూరు అనిత, అన్నం మునిశేఖర్‌గౌడ్, మేకల కమల, ఒబ్బాయి ఉమామహేశ్వరి, పొక్కలి శ్రీలక్ష్మి, సారంగం రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ పెంపొందించేందుకు, భక్తులకు ఎంటువంటి అసౌకర్యాలు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడి మృతి



మృతి చెందిన ప్రసన్న కుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడు ఉందారపు ప్రసన్న కుమార్(37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వరదయ్యపాలెం మండల రాచర్ల గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ తడ మండలం కాదలూరుకి చెందిన మౌనికతో వివాహమైంది. ఏడాది నుంచి అపాచీ కంపెనీలో పనిచేస్తూ కాదలూరులో నివాసం ఉంటున్నాడు. శనివారం కంపెనీలో విధులు ముగించుకుని సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి కాదలూరుకు వెళ్తుండగా జాతీయ రహదారిపై డంపింగ్ యార్డు వద్ద శుద్ధిచేసిన చెత్తను తీసుకుస్తున్న టిప్పర్ ఢీకొంది. తలకు బలమైన గాయమై రక్తస్రావం జరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన ప్రసన్న కుమార్‌ను స్థానికులు గుర్తించి హైవే అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ శ్రేణులకు రక్షణ కవచం డిజిటల్ బుక్

డక్కిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బుక్ వైసీపీ శ్రేణులకు రక్షణ కవచం లాంటిదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్రీనివాసులురెడ్డి అన్నారు. డక్కిలిలో ఆదివారం వైసీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులపై అకారణంగా కేసులు పెడితే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటారని చెప్పారు.

మేరీ వృద్ధాశ్రమానికి చేయూత

నాయుడుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సంజాయ్ గాంధీ కాలనీలోని మేరీ వృద్ధాశ్రమానికి టీడీపీ నాయకులు ఆకుల మణి, లక్ష్మీపతి, ముత్యాలయ్య నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భర్త పార్థసారధి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సునీతబెన్నీ, పురుషోత్తం, అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో గంజాయి బ్యాచ్ హల్‌చల్

ప్రయాణికులపై దౌర్జన్యం... దాడికి యత్నం

ప్రశ్నించిన ఆర్టీసీ కంట్రోలర్‌పైనా రుబాబు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో గంజాయి బ్యాచ్‌లు బరితెగిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి చెన్నై, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్లాట్‌ఫారాల వద్ద నలుగురు యువకులు గంజాయి పీలుస్తూ మత్తులో తూలుతున్నారు. బస్సుల కోసం వేచి ఉంటున్న వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఎదురుతిరిగిన వారిపై దాడికి దిగారు. దీంతో అక్కడున్న మహిళలు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ కంట్రోలర్లు వారిని ప్రశ్నించారు. 'మీకు ఇక్కడేం పని' అంటూ నిలదీయడంతో వారిపైనా ఎదురుదాడికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని మందలించి పంపారు. ఇలాంటి ఘటనలు ఆర్టీసీ బస్టాండులో నిత్యకృత్యమయ్యాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసుస్టేషన్‌లో సిబ్బందిని ఏర్పాటు చేసి, ఇలాంటి బ్యాచ్‌లను నియంత్రించాలని కోరుతున్నారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం స.హ చట్టం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజారెడ్డి, శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రమని జిల్లా వినియోగదారుల సమాచార సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జాతీయ సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వినియోగదారులకు అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కుచట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, జిల్లా సమాచార హక్కు ఐక్యవేదిక ప్రతినిధులు మునిచంద్రారెడ్డి, చంద్రశేఖర్, దేవేంద్ర, సుధాకర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం



5కే వాక్‌థాన్‌లో ఐఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డోన్ట్ మిస్ ఏ బీట్ అనే నినాదంతో అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసి బస్టాండు కూడలి నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు ఆదివారం 5కే వాక్‌థాన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసాద్, రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె వ్యాధులు వస్తున్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర ఆస్పత్రి వైద్యులు వెంకటశివకృష్ణ, వెంకటేష్, నౌషాద్, ఐఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఫిర్యాదు

తడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నారని పోలీసులకు ఫిర్యాదు అందింది. మండల పరిధిలోని వెండ్లూరుపాడు ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి వేనాటి గిరిరెడ్డికి అధికారులు అనుమతులు ఇచ్చారు. పనులను చేపట్టేందుకు స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో శుభ్రపరుస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి అడ్డుకున్నాడు. దీంతో గిరిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోట పోలీసుస్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఎస్ఐ పవన్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

వాకాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పంచాయతీ వడ్డిపాళెం శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. మూడు కోళ్లు, రూ.1950 స్వాధీనం చేసుకుని, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామంలో ఉరివేసుకొని కిష్టయ్య(44) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన కిష్టయ్య ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నెర్రికాలువలో రంగు మారిన నీరు - కాలువలో ప్లాస్టిక్ బాటిల్స్, వ్యర్థాలు

నెర్రికాలువలోకి పట్టణ మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారంతో సాగునీరు కలుషితం ● ఆందోళనలో రైతులు

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరందించే నెర్రికాలువలోకి సూళ్లూరుపే పట్టణ మురుగంతా కలుస్తుండడంతో నీరంతా కలుషితమవుతోంది. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం కాలువలోకి చేరి సాగుకు ఉపయోగకరంగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలు చెందుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల రైతులకు వరప్రసాదిని నెర్రికాలువ. దొరవారిసత్రం మండలం తనియాలు నుంచి సూళ్లూరుపేట మీదుగా వచ్చి తడ మండలం గొల్లలమొలువు వద్ద నెర్రికాలువ ముగుస్తుంది. ఈ కాలువ కింద దాదాపు 16చెరువుల పరిధిలో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. పిండిపాలెం వద్ద కోటపోలూరు చెరువులో ఉన్న ఎస్ఎస్ ట్యాంకును కూడా నెర్రికాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నింపి పట్టణానికి సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందిస్తున్నారు. అలాంటి నెర్రికాలువ పరిస్థితి నేడు ప్రశ్నార్థకరంగా మారింది. సూళ్లూరుపేట మండలం కోట పోలూరు రైల్వేగేటు వద్ద నుంచి చెంగాళమ్మ ఆలయం వద్ద వాటంబేడు రోడ్డు వరకు దాదాపు మూడు కిలో మీటర్ల మేర పట్టణంలో నెర్రికాలువ అంచున ఉన్న నివాసాల నుంచి వ్యర్థపునీరు కాలువల ద్వారా నెర్రికాలువలోకి కలుస్తోంది. మురుగునీరు కవడంతో సాగునీరంతా రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని కాలువల నుంచి వచ్చే వ్యర్థపునీరంతా నెర్రికాలువలో కలిసేలా మురుగు కాలువలు సైతం నిర్మించారు. దీనిపై రైతులు అధికారులకు మొరపెట్టుకుని లబోదిబోమన్న పట్టించుకునేవారే కరువయ్యారు. చెరువుల్లోకి కూడా పలుచోట్ల మురుగునీరు కలడంతో చెరువునీరంతా కూడా కలుషితమవతున్నాయి. నెర్రికాలువ బాగోగులు చూసుకోవాల్సిన అధికారులు సైతం తమకేం సంబంధం లేనట్లు ఉంటున్నారు. పాలకులూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నెర్రికాలువ ఆధునికీకరణ కోసం రూ.26 కోట్లు మంజూరైనా గత వైసీపీ పాలకుల పుణ్యంతో పనులు ముందుకు సాగలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులే స్వచ్ఛందంగా పూడిపోయిన నెర్రికాలువలో పూడిక తీసి, వ్యర్థాలను తొలిగించుకుని పొలాలకు సాగునీరు అందించుకొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణ మురుగు నెర్రికాలువలో కలువకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేగ నియంత్రణకు చర్యలేవీ?

ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు



సంగం థియేటర్ సెంటర్, రైల్వేస్టేషన్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు లేని మలుపులు

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పలు కూడళ్లు, మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురువుతున్నారు. స్థానిక సాయిబాబా గుడి సమీపంలో గూడూరు పట్టణానికి వచ్చే ప్రధాన రహదారిపై గతంలో ఉన్న స్పీడ్ బ్రేకరును తొలగించారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, కల్యాణ మండపాలు, పెద్దసంఖ్యలో దుకాణాలు ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక సంగం థియేటర్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గం ద్వారా పట్టణంలోకి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. స్థానిక మోతీ మహల్ సెంటర్, ఏరియా ఆస్పత్రి ఎదురుగా, పాతబస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వే స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ప్రతిరోజు ఏదో ఒకచోట వాహనాలు ప్రమాదాలకు లోనవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి




పెళ్లకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మండలంలోని అక్కగారిపేట వద్ద 71వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని హైవే అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ నాగరాజు చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 9440796358 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మంత్రి ఆనంకు సత్కారం



డక్కిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని డక్కిలి మండలం ఆల్తూరుపాడు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాసరం చైతన్య రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నెల్లూరులోని ఆనం నివాసంలో మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు.

కోటమ్మకు పూజలు



కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాస్టర్ డే సంబరాలు

కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు చర్చిల్లో ఆదివారం పాస్టర్ డే సంబరాలు జరిగాయి. అల్లంపాడు చర్చిలో బాబు దంపతులను సన్మానించ్నారు. పాముల సురేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదేవిధంగా గూడలి, కొండమిట్ట, చిట్టేడు, తిన్నెలపూడి, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోట ప్రాంతాల్లో పాస్టర్‌డే సంబరాలు జరిగాయి.

నేత్రదానం



పురుషోత్తం(ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గాంధీమందిరం సెంటర్ వద్ద నివసిస్తున్న కావేరిపాకం పురుషోత్తం(48) బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

నేటి నుంచి కొత్త టీచర్లు

ఉత్తర్వులు అందుకున్న ఉమ్మడి నెల్లూరు అభ్యర్థులు

పాఠశాలల్లో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ పూర్తిచేసింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు రెండురోజులపాటు నియామక పత్రాలను ఆన్‌లైన్‌లో అందచేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయడంతో ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అయ్యేలా పాఠశాలలన్నీ కోలాహలంగా మారనున్నాయి. కొత్త అయ్యోర్లు పాఠశాలలకు రానుండడంతో వారిని జాయినింగ్ చేసుకునేలా సర్వం సిద్ధం చేశారు.

నేడు విధుల్లో చేరిక

మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి పదిరోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి నియామక పత్రాలు అందచేశారు. జిల్లాలో విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలల్లో వీరిని నియమించారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలో మొత్తం 651 పోస్టులను భర్తీ చేశారు. వీటిలో ప్రభుత్వ జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 82, హిందీ 17, తెలుగు 29, ఉర్దూ 4, బయాలజీ 62, మ్యాథ్స్ 62, ఫిజికల్ సైన్స్ 74, సోషల్ 101, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 85 పోస్టులు కలిపి మొత్తం 619 భర్తీ అయ్యాయి. వీటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్ఏ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, తెలుగు 1, ఉర్దూ 1 పోస్టులు, ఎస్‌జీటీ తెలుగు 13, ఉర్దూ 4 కలిపి 20 పోస్టులు, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఎస్ఏ విభాగంలో మ్యాథ్స్ 1, ఫిజికల్ డైరెక్టర్ 1, ఫిజికల్ సైన్స్ 1, ఎస్‌జీటీ తెలుగు 9 కలిపి మొత్తం 12 పోస్టులు భర్తీ చేశారు. మొత్తం మీద ప్రభుత్వ, జడ్పీపీ, ఎంపీపీ పాఠశాలల్లో 619 పోస్టులు, కార్పొరేషన్ పాఠశాలల్లో 20, మున్సిపాలిటీ పాఠశాలల్లో 12 కలిపి మొత్తం 651 మంది కొత్త టీచర్లు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

పాఠశాలల్లో కొత్తగా చేరుతున్న ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలి. సోమవారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరిన వెంటనే ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులు వెంటనే రిలీవ్ అయి కావాలి. మంగళవారం నాటికి వారు బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేరిన పాఠశాలల్లో రిలీవ్ చేయని వారిని కూడా వెంటనే రిలీవ్ చేసేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలి. కొత్తగా చేరిన టీచర్ల రిపోర్ట్ తేదీని పాఠశాల రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు వారి అర్హత సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. పత్రాలు సరిగాలేని వారి వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియచేయాలి.

- డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కార్మికులకు అందేలా కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాంత్‌ప్రకాశ్‌జాటవ్

గూడూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను కార్మికులకు అందేలా నాయకులు కృషి చేయాలని బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు శాంత్‌ప్రకాశ్‌జాటవ్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణలోని బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో బీజేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాలి మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో కార్మికసంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటత కార్మికుల శ్రేయస్సు కోసం బీజేఎంఎస్ కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకునేందుకు నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాలి మధుసూదన్ యాదవ్, బాలకృష్ణ, సంతోష్, ప్రశాంత్, యశ్ పవార్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటా డీఎస్సీ నిరుద్యోగులకు వరం: కురుగొండ్ల



డీఎస్సీలో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇకపై ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుండడం నిరుద్యోగులకు వరం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించిన నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రామకృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయలకు మేలు జరిగిందంటే ఒక్క టీడీపీ ప్రభుత్వంలోనేనని చెప్పారు. కొత్తగా ఉద్యోగంలో చేరబోతున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరరావు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల గోడౌన్‌పై పోలీసుల దాడులు

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోటపోలూరు రోడ్డులోని టపాసుల గోడౌన్‌పై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.2.5 లక్షల విలువగల 25 టపాసుల బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. మాదరపాకం జగన్మోహన్, ఖాదర్‌బాషాకు చెందిన గోడౌన్‌గా గుర్తించారు. ఈ దాడుల్లో సీఐ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. దీపావళి పండుగ సమయంలో టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

భర్తల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భార్యల నుంచి భర్తలకు రక్షణ కల్పించడంతోపాటు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని భార్యా బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బాలాజీరెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు సహజమన్నారు. భర్తపై భార్య కేసు పెడితే చట్టాలు చాలా కఠినంగా అమలువుతున్నాయని, అదే తరహాలో భర్తలు పెట్టే కేసుల విషయంలోనూ చట్టాలు కఠినంగా ఉండాలని కోరారు. లీగల్ అడ్వైజర్ ముని బాబు, చంద్రకళారెడ్డి, దాసు, నాగరత్న పాల్గొన్నారు.

సాహిత్యంతో ఉత్తమ విలువలు

గార్లపాటి పురస్కార ప్రదానోత్సవంలో రమేష్‌నాథ్



పురస్కారాలు అందుకున్న ముక్తేశ్వరరావు, గోవిందు, గంగాధర ప్రసాద్, మల్లేశ్వరరావు, దామోదర్ నాయుడు తదితరులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజంలో ఉత్తమ విలువలు నెలకొల్పడానికి మార్గదర్శకం వహిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల అన్నారు. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో ఆదివారం విశ్వ సాహితీ సంస ఆధ్వర్యంలో గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని, సాహితీ సేవా రంగంలో నిరంతరం కృషి చేస్తున్న రచయితలు, కవులు, పండితులను ఏటా సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థకు ఆయన రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు, ప్రముఖ నవలా రచయిత మురిసెట్టి గోవిందు, సీనియర్ పాత్రికేయులు, కవి, అనువాదకులు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఉపాధ్యాయులు, కవి సురేంద్ర రొడ్డ, విశ్రాంత ఆచార్యులు, సంఘ సేవకురాలు ఆచార్య కట్టమంచి మహాలక్ష్మమ్మలకు గార్లపాటి పురస్కారాలను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఆదర్శ రైతులు ఏనుగు తారాపతి, దామా అయ్యప్ప నాయుడులకు ఏనుగు అంకమ నాయుడు సౌజన్యంతో రైతు పురస్కారాలను అందించారు. అనంతరం విశ్వ సాహితీ సంస్థ నిర్వాహకులు గార్లపాటి దామోదర నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సాహితీవేత్తలు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సుధాకర్ చౌదరి, శతావధాని ఆముదాల మురళి, రాస్ అధికారి నాగరాజు నాయుడు, పైనేని తులసీనాథం నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, మేమూరి జయరాం ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజు, వాకా ప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య రాజేశ్వరమ్మ, డాక్టర్ వి.కృష్ణవేణి, గంగవరపు శ్రీదేవి, తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ మౌని, ఆర్‌సీకేరాజు, డాక్టర్ పరమేశ్వరయ్య, డాక్టర్ మస్తానమ్మ, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జునలతోపాటు పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.